# జ్ఞానులు-అజ్ఞానులు

ఈ కథో, ఇటువంటి కథో, ఎప్పుడో చిన్నప్పుడు 'చందమామ'లో చదివిన గుర్తు. ఇది నాకు నచ్చిన కథ. మీరు కాపీ కథ అన్నా సరే- అరవై ఏళ్ళ వయసులో బాల్యం గుర్తుకు తెచ్చుకుంటూ, నన్ను మైమరపించిన 'చందమామ' కథల శైలిలో ఈ కథ కూడా 'అనగనగా...' అంటూ ప్రారంభిస్తాను.

అనగనగా....

ఒక ఊరిలో ఒక చాకలి వుండేవాడు. వాడు రోజూ తెల్లవారుతుండగా గాడిద వీపు మీద బట్టల మూటలు పడేసి రేవుకి వెళ్ళేవాడు. ఒళ్ళు హూనమయ్యేట్టు బట్టలు బండకేసి ఉతికి, ఆరేసి, సాయంకాలం ఉతికిన బట్టల మూటలు మళ్ళీ గాడిద మీద వేసి, చీకటి పడుతుండగా గుడిసెకి చేరుకునేవాడు.

ఇదీ చాకలి దినచర్య.

ఒక రోజు చాకలి రేవుకి వెడుతుంటే దారిలో మర్రిచెట్టు కింద ముగ్గురు జ్ఞానులు కనుపించారు. జ్ఞానులు ధవళ వస్త్రాలలో, మూరెడు వెండి గడ్డాలతో దివ్యతేజస్సుతో వెలిగిపోతున్నారు. వారిని చూసి చాకలి ఆగి, వినయంగా వారి పాదాలకు నమస్కరించాడు.

వాడి నమస్కారాలందుకుని, మౌనంగా చేతులెత్తి దీవించి, వారు తమ ఆధ్యాత్మిక చర్చల్లోకి తిరిగి వెళ్ళిపోయారు.

'మిత్రమా! పరమాత్మ వెలుగు, ఆత్మ ఆ వెలుగు కిరణం అయినప్పుడు, ఆత్మ కూడా పరమాత్మ వెలుగే కదా! ఆత్మ, పరమాత్మలో భాగమైనప్పుడు ఇంకా వేరే మోక్షం ఏమిటి?' - మొదటి జ్ఞాని అడిగాడు.

'.... పరమాత్మ నుంచి వెలువడిన వెలుగు శకలం తిరిగి పరమాత్మను చేరడమే మోక్షం మిత్రమా...' అన్నాడు రెండో జ్ఞాని.

'.... నేను అంగీకరించలేను మిత్రమా! ఆత్మవేరు, పరమాత్మవేరు. ఆత్మ తన కర్మ అనుభవిస్తుంది. పుణ్యం చేస్తే స్వర్గానికి పోతుంది, పాపంచేస్తే నరకానికి పోతుంది. మోక్షం అంటూ వేరే ఉండదు...' అన్నాడు మూడో జ్ఞాని.

చాకలి జ్ఞానుల మాటలు ఆశ్చర్యంతో నోరు తెరుచుకు వినసాగాడు. అలా వింటూ కూర్చుండిపోయేవాడే కాని రాజుగారి బట్టలు ఉతకకపోతే తన తల కోట గుమ్మానికి వేలాడుతుందన్న సంగతి గుర్తుకు వచ్చి రేవుకి పరిగెట్టాడు.

రేవుకి వెళ్ళాడేకాని చాకలి మనసంతా జ్ఞానుల మీదే ఉంది. త్వరత్వరగా బట్టలు ఉతికి, ఆరేసి, పరిగెట్టుకొచ్చి, మళ్ళీ జ్ఞానుల పాదాల దగ్గర వాలాడు.

'.... ఆత్మ పరిశుద్ధమైంది. శరీరం చేసిన పాపం ఆత్మకు ఎలా అంటుతుంది? పాపం చేస్తే నరకం, పుణ్యం చేస్తే స్వర్గం అన్నది తప్పు. ఆత్మకి పాపపుణ్యాలంటనప్పుడు, మరణానంతరం స్వర్గం, నరకం అన్న ప్రసక్తి లేదు...' అన్నాడు మొదటి జ్ఞాని.

'... అసలు ఆత్మ ఎక్కడుంటుందంటావు?' రెండో జ్ఞాని ప్రశ్నించాడు.

'...హృదయానికి కింద సూక్ష్మరూపంలో దివ్యజ్యోతిలా వెలుగుతూ ఉంటుంది'... అన్నాడు మొదటి జ్ఞాని.

'తప్పు మిత్రమా! ఆత్మ రెండు కనుబొమల మధ్య భ్రుకుటి స్థానంలో ఉంటుందని శాస్త్రాలు చెబుతున్నాయి. హృదయస్థానంలో ఉండదు...' – మూడో జ్ఞాని వివరించాడు.

జ్ఞానుల చర్చలు వింటున్న చాకలికి పొద్దు తెలియలేదు. మెల్లిగా పొద్దు పడమటికి వాలిపోయింది. గుడిసెకి వెళ్ళే వేళయింది. రేవులో చాకలికోసం ఎదురు చూస్తున్న గాడిద అసహనంగా కదులుతూ ఓండ్ర పెట్టింది.

'మిత్రమా! చీకటి పడుతోంది. మనం ఇక్కడ ఉండడం క్షేమం కాదు– పులిగాండ్రింపు విన్నావు కదా...' అన్నాడు మొదటి జ్ఞాని.

'అవును–ఇంక లేవడం మంచిది. కాని మిత్రమా, అది పులికాదు–సింహం–సింహం గర్జిస్తోంది' అన్నాడు రెండో జ్ఞాని.

మూడో జ్ఞాని మిత్రులకేసి చిరునవ్వు నవ్వి – 'అది పులీ కాదు, సింహమూ కాదు – ఏనుగు– ఏనుగు ఘీంకరిస్తోంది....' అన్నాడు.

చాకలి తెల్లబోయాడు. తాను మహాజ్ఞానులనుకుంటున్న వాళ్ళు మహా మూర్ఖులనీ, తాను దివ్యజ్ఞానమనుకుంటున్నది శుష్కతర్కమనీ వాడికి అర్థమైంది. వీళ్ళకంటే నేనూ, నా గాడిదే నయం అనుకుని నవ్వుకుంటూ రేవుకి పరిగెట్టాడు చాకలి.

*(ప్రజాసాహితి మాసపత్రిక, జనవరి, 2007)*